క్లుప్తంగా

నష్టపరిహారం అందేలా చర్యలు



విడవలూరు: మండలంలోని ముదివర్తికి చెందిన రైతు గుండుబోయిన వెంకటేశ్వర్లు సాగు చేసిన పంట వర్షానికి నీటమునిగింది. ఈ క్రమంలో పొలాన్ని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, సహాయ వ్యవసాయ సంచాలకుడు నర్సోజీ శుక్రవారం పరిశీలించారు. రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, ఎంపీఈఓ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



ఇందుకూరుపేట: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మైపాడు, కొరుటూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. బీపీటీ – 5204 రకం వరి విత్తనాల ధర రూ.1045 కాగా, రూ.920కు ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. కేఎన్నెమ్ – 1638 విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నామని పేర్కొన్నారు. విత్తన శుద్ధి, నారు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వెటర్నరీ డాక్టర్ అస్లామ్, ఏఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏలు పెంచలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

దాత సాయంతో దహనశాల నిర్మాణం



ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో గల శ్మశాన వాటికలో దహనశాలను దాత సాయంతో నిర్మించారు. దీనికి సంబంధించిన వివరాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గూడూరు శివకుమార్‌రెడ్డి తెలియజేశారు. దీని నిర్మాణానికి ప్రవాస భారతీయుడు ఇందుపూరు పవన్‌కుమార్‌రెడ్డి రూ.ఆరు లక్షలను అందజేశారని చెప్పారు. పవన్‌కుమార్‌రెడ్డి నాయినమ్మ మీనమ్మ మృతి చెందిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో దహన సంస్కారాలను నిర్వహించేందుకు వీలుపడలేదని, దీంతో ఆమె మృతదేహాన్ని నెల్లూరు తీసుకెళ్లి కార్యక్రమాలను నిర్వహించారని పేర్కొన్నారు. గ్రామంలో ఈ తరహాలో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దహనశాలను నిర్మించారని చెప్పారు. దీనిపై ఆయనకు కృతజ్ఞతలను తెలియజేశారు.


వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నేడు

పొదలకూరు: పట్టణంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం ఉదయం పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు, కలువాయి, మనుబోలు మండలాల సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని ఏడీఏ కె.శివనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల ఉద్యోగులు, విస్తరణాధికారులు పాల్గొంటారన్నారు. నెల్లూరు జిల్లా వ్యవసాయ వనరులు కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరం

కోవూరు: కోవూరులోని కైలాస భూమి, పార్థీవ దేహ నిలయాన్ని కట్టించిన దాత బండి సుధాకర్‌రెడ్డి మృతి చెందడం బాధాకరమని కైలాస భూమి నిర్వాహకుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించారు. కాగా ఆయన నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో దానం చేశారు.

బాధ్యతల స్వీకరణ



అనురూప్

ముత్తుకూరు: మండల సర్వేయర్‌గా అనురూప్ స్థానిక కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు రూరల్ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పలు పార్టీల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ సర్వేయర్‌గా పనిచేసిన మహబూబ్‌బాషా టీపీ గూడూరుకు బదిలీ అయ్యారు.

ఆగని దొంగతనాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఆగడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా సంబంధిత అధికారులే వెల్లడిస్తున్నారు. వాటి భద్రతను రైతులు చూసుకోవాల్సిందిగా గ్రామాల్లో తమ సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైతే తిరిగి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అనేక రకాలుగా ఇబ్బందులు ఉండడంతో అన్నదాతలు కష్టాలు పడాల్సి వస్తోంది.

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి వైరు చోరీ
- ఈ ఏడాదే సబ్ డివిజన్ పరిధిలో 58 దొంగతనాలు
- కొత్త వాటి ఏర్పాటులో అనేక చిక్కులు
- ఎఫ్ఐఆర్ కాపీ ఉంటేనే..
- రైతులే కాపాడుకోవాలంటున్న విద్యుత్ అధికారులు

ఏప్రిల్ నుంచి ఏ సెక్షన్లో ఎన్నంటే..

పొదలకూరు	:	37
విరువూరు	:	6
మనుబోలు	:	15



రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దృశ్యం



మినీ ట్రాన్స్‌ఫార్మర్

పొదలకూరు: ఉద్యాన సాగు అధికంగా ఉన్న గ్రామాల్లో పంటలకు నీటిని పెట్టుకునేందుకు రైతులు విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతుంటారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. వాటిని పగులగొట్టి రాగి వైరు ఎత్తుకెళ్తున్నారు. తిరిగి కొత్తది బిగించేందుకు సమయం పడుతోంది. ఇందుకోసం ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగిన ప్రాంతానికి చెందిన అన్నదాతలు వెళ్లి విద్యుత్ అధికారులకు సమాచారం అందజేస్తే వారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తారు. కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని అందజేస్తే కొత్తది ఏర్పాటు చేస్తారు. ఇదంతా జరగాలంటే ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చాలా ఏళ్లుగా..

పొదలకూరు పరిసర ప్రాంతాల్లో చాలా సంవత్సరాలుగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అధికంగా పొదలకూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో చోరీలు జరిగినట్టు అధికారులు తేల్చారు. ఇప్పటి వరకు 58 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేస్తే 15 ట్రాన్స్‌ఫార్మర్లను తిరిగి అమర్చడం జరిగింది. మిగిలిన వాటిని బిగించాల్సి ఉంది. అయితే చోరీ జరిగిన వాటికి సంబంధించిన సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్ కాపీలు అందకపోవడం, ఇతర సాంకేతిక కారణాల వల్ల అన్నింటిని అధికారులు ఏర్పాటు చేయలేకపోతున్నారు. స్తంభం నుంచి తొలగించి దానిని పగులగొట్టి అందులో ఉన్న రాగి తీగను ఎత్తుకెళ్లారంటే విద్యుత్ పనులు చేసేవారై ఉండాలి. ఇలాంటి చోరీ ముఠాలో ఆ పనులు తెలిసిన వారు ఒకరుంటారనేది గతంలో పట్టుబడిన దొంగల ద్వారా తెలిసింది. మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నందున వరుసగా రెండు నుంచి మూడు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొడుతున్నారు.

మీరే చూసుకోండి

తోటలు, పొలాల్లో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను ఇకపై ఆయా రైతులు చూసుకోవాల్సిందిగా అధికారులు వెల్లడించారు. చోరీలు అధికమవుతున్న నేపథ్యంలో అన్నదాతలు కూడా తమ వంతు బాధ్యతను తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఎంతోకాలంగా దొంగతనాలు జరుగుతున్నా ఆ ముఠాను కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవల పొదలకూరు మండలం ముదిగేడులో పోలీసులు నిఘా పెట్టి పట్టుకునే సమయానికి వారు తప్పించుకున్నారు. దీంతో అటు విద్యుత్ అధికారులు, ఇటు పోలీసులు విసిగిపోయి రైతులు కూడా భాగస్వామ్యం తీసుకుని దొంగలపై నిఘా పెట్టాల్సిందిగా సూచిస్తున్నారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో కూడా విడుదల చేశారు.

రైతుల భాగస్వామ్యం అవసరం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టడంలో రైతుల భాగస్వామ్యం అవసరం. మా సిబ్బంది నిరంతరం దొంగలను గుర్తించి పట్టుకోలేరు కనుక ప్రతినిత్యం తోటల్లోకి వెళ్లే రైతులు గమనిస్తుండాలి. అంతే కాకుండా కొత్త ముఖాలు సంచరిస్తుంటే వెంటనే సమాచారం పోలీసులకు అందజేస్తే మంచిది. చోరీకి గురైన వాటిలో ఇప్పటి వరకు 45 ట్రాన్స్‌ఫార్మర్లను తిరిగి బిగించాల్సి ఉంది.

– సుబ్రహ్మణ్యం, విద్యుత్ డీఈఈ, పొదలకూరు

మోటార్‌బైక్‌ను ఢీకొన్న ఆటో

- వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన ఇస్మాయిల్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్‌కు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైనే వ్యర్థాలు



విడవలూరు: వీరారెడ్డిపాళెంలోని గిరిజన కాలనీ వద్ద కాలువ పూడికను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో తీయించారు. అయితే కాలువలోని వ్యర్థాలను గిరిజన కాలనీ రోడ్లపైనే వదిలేయడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉంది. చిన్న పిల్లలతో పాటు వాహనదారులు నిత్యం ఈ మార్గం మీదుగా వెళ్తుంటారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భూముల ధరలను పరిశీలించి న్యాయం చేస్తాం

- కలెక్టర్ ఆనంద్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పొదలకూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు సంబంధించి భూములు కోల్పోతున్న రైతుల అభ్యర్థనలను పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని అంకుపల్లి గ్రామంలో రైల్వేలైన్ కోసం సేకరిస్తున్న భూములను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకుపల్లి గ్రామంలో 54 ఎకరాల భూములను సేకరించడం జరిగిందన్నారు. ఇక్కడి రైతులకు రూ.4.50 లక్షల నష్ట పరిహారాన్ని గతంలో ప్రటించినట్టు పేర్కొన్నారు. అయితే తక్కువగా ప్రకటించారని భూములను అందజేయడంలో అన్నదాతలు విముఖత చూపుతుండడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు విచ్చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన రైతులు పక్క గ్రామం వావింటపర్తిలో ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల నష్ట పరిహారం అందజేస్తున్నట్టు తెలిపారు. తమ గ్రామంలో నిమ్మ, మామిడి చెట్లకు కేవలం పరిహారంగా రూ.100 అంచనా వేసినట్లు వెల్లడించారు. పరిహారం ప్రకటించడంలో అన్యాయం జరిగిందన్నారు. న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూష, తహసీల్దార్ శివకృష్ణ ఉన్నారు.

క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించాలి

- జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

వెంకటాచలం: జిల్లాలో క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించి సంబంధిత పీహెచ్‌సీల్లో వివరాలు అందజేయాలని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని కసుమూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను చూశారు. లక్ష్యాలను నూరుశాతం సాధించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు వైద్య సేవలందించాలని పేర్కొన్నారు.

నిర్మూలనే లక్ష్యంగా..

మనుబోలు: క్షయ వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి క్రమం తప్పకుండా చికిత్స అందించాలని ఆదేశించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వ్యాక్సిన్‌పై ఎవరికైనా అపోహలుంటే తొలగించాలన్నారు. బుధ, శనివారాల్లో క్రమం తప్పకుండా యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నందున వెంటనే ఆరోగ్య సిబ్బంది అన్ని సచివాలయాల పరిధిలో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేసి నీటిని శుద్ధి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గేయ పూజిత, సీహెచ్ఓ రాజయ్య, సూపర్‌వైజర్లు హైమావతి, వెంకటరమణయ్య, హెల్త్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తోటపల్లిగూడూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సంబంధిత టీచర్ రామచంద్రయ్య తెలిపారు. డైస్లెక్సియా మాసోత్సవంలో భాగంగా రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు తోటపల్లిగూడూరు ప్రత్యేక అవసరాల గల చిన్నారుల పాఠశాలలో శుక్రవారం ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో షహనాజ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలకు డిమాండ్



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వెంకటాచలం: జిల్లాలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న డిగ్రీ కళాశాలలపై చర్యలు చేపట్టాలని ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సుకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై యాజమాన్యాలతో మాట్లాడినా పట్టించుకోవడం లేదని తెలియజేశారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



వివరాలు తెలుసుకుంటున్న పీడీ

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. మండలంలోని మాచర్లవారిపాళెం, గణపతినగర్‌లో ఉన్న కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



మాట్లాడుతున్న సీఐ రాంబాబు

పొదలకూరు: నేరాల నియంత్రణ కోసం మండలంలో 156 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ సభ్యులు, బస్టాండ్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముందుగా వ్యాపారులు నేరాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దొంగతనాలు, నేరాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల లోపలే కాకుండా వెలుపల కూడా కెమెరాలను పెట్టుకోవాల్సిందిగా సూచించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను వినియోగించి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించి కేసులను ఛేదించడం సులువు అవుతుందన్నారు. సమావేశంలో ఎస్సై ఎస్‌కే హనీఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : ఎస్సై



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాకేష్

మనుబోలు: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్సై శివరాకేష్ అన్నారు. ఎస్పీ ఆదేశాలతో శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి అతి వేగంతో ఆటోలు నడపడం ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల బారిన పడి ఎంతోమంది చనిపోవడమో, అంగవైకల్యంతో బాధపడడమో జరుగుతుందని తెలిపారు. అలాగే ఆటోవాలాలు కొందరు తమకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవని తెలిపారు. దీనికి స్పందించిన ఎస్సై ఎక్కువ మంది ఉంటే సంబంధిత అధికారులు నేరుగా ఇక్కడికే వచ్చిన లైసెన్స్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి గ్రామసభలు



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బయ్య

మనుబోలు: రీసర్వే జరిగిన గ్రామాల్లో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం శనివారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనుబోలు, పిడూరు, చెర్లోపల్లి, వీరంపల్లి, మడమనూరు గ్రామాల్లో ఇప్పటి వరకు సర్వే జరగలేదన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో పూర్తయిందని వీటిల్లో గ్రామసభలు నిర్వహించి సమస్యలపై అర్జీలు స్వీకరించి లోపాలను సరిదిద్దుతామని తెలిపారు. సమావేశంలో సర్వేయర్ శ్రీనివాసరావు, డీటీ బషీర్, రీసర్వే డీటీ మంజుల, ఆర్ఐ నారాయణ, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- వెంకటాచలం: మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో శనివారం నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చెముడుగుంట గ్రామ సచివాలయంలో సదస్సు నిర్వహిస్తామని రైతులు తమ సమస్యలపై అర్జీలివ్వాలని తెలియజేశారు. 22న అనికేపల్లి – 2 గ్రామ సచివాలయం, 23న పుంజులూరుపాడు, 25న కందలపాడు, 26న పాలిచెర్లపాడు, 29న కురిచెర్లపాడు, 30న కంటేపల్లి, నవంబర్ 2న ఇడిమేపల్లి, 5న ఈదగాలి, 6న కాకుటూరు, 8న అనికేపల్లి, 12న సర్వేపల్లి, 13న కనుపూరు గ్రామంలో నిర్వహిస్తామని వెల్లడించారు.

అధికారులకు సన్మానం



సన్మానం అందుకున్న అధికారులు

మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామంలో పనిచేస్తూ బదిలీ అయిన వివిధ శాఖల అధికారులను శుక్రవారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్వో శీనమ్మ, డిజిటల్ అసిస్టెంట్ నజీర్ బాషా, సర్వేయర్ రాజేశ్వరి తదితరులను సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రస్తుత వీఆర్వో శ్రీనివాసులు, డిజిటల్ అసిస్టెంట్ నాగజ్యోతి, వెల్ఫేర్ అసిస్టెంట్ సౌజన్య, ఏఎన్ఎం నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే నరకమే..!



వర్షంతో నీటమునిగిన రోడ్డు

- వీధులన్నీ మురుగుతో నిండిపోతున్నాయి
- ఎమ్మెల్యేను ప్రశ్నించిన స్థానికులు



ఎమ్మెల్యేకు సమస్యను తెలియజేస్తున్న స్థానికులు

కోవూరు: వర్షమొస్తే తమ వీధులన్నీ మురుగుతో నిండిపోతున్నాయని కోవూరు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉంటున్న వారు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి సమస్యను స్థానికులు తెలియజేశారు. మీరొస్తే గానీ తమ వీధులపై ఎవరూ దృష్టి సారించడంలేదని చెప్పారు. వర్షమొస్తే ఇక్కడ రెండడుగుల మేర నీరు నిలిచిపోతోందని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలను వలంటీర్ల ద్వారా అధికారులకు తెలియజేసేవారమని, ఇప్పుడా పరిస్థితే లేదని తెలిపారు.

శాశ్వత పరిష్కారం కావాలి



మా వీధిలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. తాత్కాలిక పనులతో ఎలాంటి ఉపయోగం ఉండదు. కాలువలు పూడి పోయి మురుగు పారడంలేదు.

– కోటేశ్వరరావు, కోవూరు

చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు



చిన్నపాటి వర్షానికే మాకు అవస్థలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయో అర్థం కావడంలేదు.

– మురళి, కోవూరు

త్వరలోనే పరిష్కారం

సమస్య రెండు రోజుల క్రితమే మా దృష్టికి వచ్చింది. పనులకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరలోనే పనులను ప్రారంభించి సమస్యలను పరిష్కరిస్తాం.

– శ్రీహరి, ఎంపీడీఓ